క్లుప్తంగా

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

తెనాలిరూరల్: అగ్నిమాపక వారోత్సవాలు ముగిశాయి. ఈ నెల 14వ తేదీ నుంచి వారం రోజుల పాటు పలు అవగాహన కార్యక్రమాలను అగ్నిమాపక అధికారులు నిర్వహించారు. ముగింపు సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది కుటుంబ సభ్యులకు ప్రమాదాల నివారణ గురించి వివరించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురికాకుండా, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బయటపడేందుకు పాటించాల్సిన సూత్రాల గురించి ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి కోటిరెడ్డి వివరించారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాలకు ఘన నివాళి



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని సమాధుల తోటలో ఆదివారం తెల్లవారుజామున పాస్టర్ ప్రవీణ్ పగడాలకు పాస్టర్ సురేష్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద క్యాండిల్స్ వెలిగించి ప్రార్థన చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని విచారణ వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీ, ఉన్నం లక్ష్మయ్య పాల్గొన్నారు.

బెట్టింగ్ నిర్వాహకుల అరెస్ట్

తెనాలిరూరల్: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ కొత్తపేటలోని ఓ లాడ్జిలో బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారంతో వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు తన సిబ్బందితో కలసి ఆకస్మిక దాడులను శనివారం రాత్రి నిర్వహించారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న వలసల శ్రీనివాసరావు, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని ల్యాప్‌టాప్, ట్యాబ్, మూడు సెల్‌ఫోన్‌లు, రూ. 11,860 స్వాధీనపర్చుకున్నారు. అరెస్ట్ వివరాలను ఆదివారం రాత్రి సీఐ తెలిపారు. బెట్టింగ్ నిర్వహిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

పోలేరమ్మ దేవాలయంలో అన్నసంతర్పణ



బాపట్ల: బాపట్ల అధిష్టాన దేవత పోలేరమ్మ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా భారీ అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం మహిళలు 108 కలశాలతో నగరోత్సవం నిర్వహించారు. విశేష అభిషేకం, అర్చన, మహా కుంభ హారతి, భక్తులకు అన్న సంతర్పణ ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. మూడు రోజులుగా చేపట్టిన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. భక్తులు భారీగా పాల్గొన్ని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

వీసీకి అభినందన

మంగళగిరి టౌన్: ఇటీవల కర్నూలు–రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఉడతా వెంకట బసవరావును ఆదివారం ఆయన నివాసంలో స్థానిక ఆధ్యాత్మిక, ధార్మిక సంఘాల ప్రతినిధులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వెంకట బసవరావు దంపతులను శాలువాలతో సత్కరించారు. మంగళగిరి పట్టణానికి చెందిన వెంకట బసవరావు వీసీగా నియమితులు కావడం పద్మశాలీయ సామాజిక వర్గానికి ఎంతో సంతోషంగా ఉందన్నారు. వీసీగా బసవరావు సారథ్యంలో యూనివర్సిటీ పరిధిలో విద్యాప్రమాణాలు పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్ల భక్తబృందం కమిటీ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఫణిదపు శ్రీనివాసరావు, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి రథచక్రాల బృందం సభ్యులు నందం శ్రీనివాసరావు, ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

తాడికొండ: క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు ఆర్థిక సాయం అందించారు. తాడికొండ మండలం మోతడక గ్రామానికి చెందిన కొల్లిపాక స్వాతికి ఏపీ కుమ్మర శాలి వాహన సంఘం ప్రతినిధులు రూ. 27 వేలను అందజేశారు. దాతలు ఆకారపు శ్రీనివాస్, దండు లక్ష్మీ ప్రసన్న, చేపత్తి లక్ష్మీదుర్గ, జిల్లా కమిటీల ద్వారా ఈ మొత్తం సేకరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలాపురం వెంకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం భాస్కర శ్రీనివాస్ చేతుల మీదుగా స్వాతికి అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ, ఉపాధ్యక్షుడు ఆకారపు అంకమ్మరావు, యువజన విభాగ అధ్యక్షుడు మామిళ్ళ పల్లి సుబ్బారావు, ఎ.పూర్ణచంద్రరావు, రాజవరపు సుబ్బారావు, సీహెచ్ కోటేశ్వరరావు, ఇ.హనుమంతరావు, కె.వెంకటేశ్వర్లు, ఆకారపు సాంబయ్య, సీహెచ్ కాశయ్య, జి.ఏడుకొండలు, ఎం.రాంబాబు, అప్పారావు పాల్గొన్నారు.

పలు చర్చిలలో ఈస్టర్ వేడుకలు



ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



నందివెలుగులోని ఇమ్మానియేల్ ప్రార్థన మందిరంలోని సభ్యులకు ప్రార్థన చేస్తున్న రెవరెండ్ భానుప్రసాద్

- ఏసుక్రీస్తు పునరుద్ధానంలోని అంతర్యాన్ని తెలుసుకోండి
- టౌన్‌చర్చి పాస్టర్ రెవరెండ్ దేవరపల్లి ఏసురత్నం

తెనాలిఅర్బన్: ఏసుక్రీస్తు పునరుద్ధానంలోని అంతర్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని టౌన్ చర్చి పాస్టర్ రెవరెండ్ దేవరపల్లి ఏసురత్నం పేర్కొన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా బోసురోడ్డులోని టౌన్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవునిగా భూలోకానికి వచ్చి ప్రజల పాపాల విముక్తి కోసం మరణించారని తెలిపారు. మూడో రోజున ఏసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచారని, ఆరోజును ప్రజలు ఈస్టర్‌గా జరుపుకుంటారని చెప్పారు. ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ చర్చి రెవరెండ్ యామర్తి లెనిన్‌బాబు, రెవరెండ్ దగ్గుమల్లి సల్మాన్‌రాజు, రెవరెండ్ వీబీ ప్రకాష్‌బాబు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



టౌన్‌చర్చిలో వాక్యపరిచర్య చేస్తున్న రెవరెండ్ ఏసురత్నం

- మారీసుపేటలోని ఫిలదెల్ఫియా చర్చిలో పాస్టర్ చిలువూరి నతానియేలు ఈస్టర్ సందేశాన్ని అందించారు. అలాగే మారీసుపేటలోని న్యూజెరూసలేమ్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ సాపాటి విజయ్‌కుమార్ వాక్యపరిచర్య చేశారు. ఐతానగర్‌లోని లూథరన్ చర్చిలో క్రిస్మస్ ఆరాధనలను పాస్టర్ వి.వి. సర్వోన్నతరావు నిర్వహించారు. క్రీస్తు పునరుద్ధరణం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.
- ఈస్టర్ పండుగను పురస్కరించుకుని నందివెలుగు జాషువా నగర్‌లోని ఇమ్మానియేల్ ప్రార్థన మందిరంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. రెవరెండ్ ఎ.భానుప్రసాద్ క్రీస్తు సందేశాన్ని అందించి అందరికీ వ్యక్తిగత ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.
- ఐతానగర్‌లోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. మేజర్ పి.నాగరాజు దైవ సందేశాన్ని అందించారు. అలాగే పట్టణంలోని పలు చర్చిల్లో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చి పాస్టర్లు క్రీస్తు పునరుద్ధానం పై ప్రసంగించారు.

యద్లపాడులో...

యద్లపాడు: క్రీస్తు మళ్లీ పుట్టిన రోజును పురస్కరించుకుని నిర్వహించే పండగ ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం పట్టణంలోని అని క్రైస్తవ వాడల్లో సందడి నెలకొంది. ఈస్టర్‌డే సందర్భంగా చర్చిలు విశ్వాసులతో నిండిపోయాయి. దైవసేవకులు కీర్తనలు ఆలపించి, ఏసుక్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. దైవకుమారుడు మరణాన్ని జయించి తిరిగి పునరుర్ధారణ విశిష్టతలను వివరించారు. ఈస్టర్ పండుగ నాడు నిర్వహించే ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. మందిరాల్లో ప్రార్థనలు ముగిశాక, ఎస్సీ కాలనీల్లో ఉన్న సమాధుల వద్దకు తమ కుటుంబ సభ్యులతో వెళ్లి వాటికి వివిధ రకాల పూలతో అలంకరణలు చేశారు. మృతి చెందిన తమపెద్దల ఆత్మశాంతికై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భక్తితో క్రీస్తు పునరుత్థాన ప్రార్థనలు

తెనాలిరూరల్: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు భక్తశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారుజామునే లేచి సమాధుల తోటలకు వెళ్లి వారి పరక్త సంబంధీకుల సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిలలో సంఘ కాపరులు ప్రత్యేక ఈస్టర్ ఆరాధనలను నిర్వహించారు. మండలంలోని చావావారిపాలెంలో ఈస్టర్ పండుగ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. లూథరన్ సంఘ కాపరి పత్రే వరబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్మంలో క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెనాలి మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో ప్రత్యేక ఆరాధనను ఆదివారం నిర్వహించారు. 'క్రీస్తు లేపబడియుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే' అన్న అంశంపై బిషప్ పినపాటి జాన్‌పాల్ దైవ సందేశం అందించారు. సంఘ పెద్దలు పినపాటి డేవిడ్ రాజు, ఈవూరు శ్రీనివాసరావు, ఆరె దానియేలు, కసుకుర్తి భాస్కరరావు, జయరాజు, కొలివరపు ఏసుదాసు, పినపాటి ఫ్రాన్సిస్, ఈవూరి ఏసురత్నం, సంఘస్తులు పాల్గొన్నారు. మల్లెపాడు బాప్టిస్టు చర్చి, పెదరావూరులోని బాప్టస్టు, లూథరన్ చర్చలలో ఈస్టర్ ప్రత్యేక ఆరాధనలను మహిమకరంగా నిర్వహించారు.



చావావారిపాలెంలో ర్యాలీలో క్రైస్తవులు

చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న కిషోర్ గురూజీ



మజ్జిగను పంపిణీ చేస్తున్న డాక్టర్ పావని ప్రియాంక

తెనాలిఅర్బన్: చలివేంద్రాల్లో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని హ్యాపీ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ పావని ప్రియాంక పేర్కొన్నారు. శ్రీ శివలింగేశ్వస్వామి భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆదివారం మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కుర్రా శ్రీనివాసరావు, షేక్ మీరావలి, ఎస్ఆర్‌కె శర్మ, శ్రీను, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

- శ్రీ ప్రసన్నాంజనేయస్వామి భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో రజకపేటలో ఆదివారం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభ్యులు ఉప్పలపాటి సాయికృష్ణ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగను పంపిణీ చేసినట్లు చెప్పారను. కార్యక్రమంలో పెసర్లంక రమణ, ఎ.సాయిరామ్, పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అప్పలస్వామి గుడి వద్ద..

తెనాలిటౌన్: బాటసారుల వేసవి దాహార్తినీ తీర్చేందుకు చలివేంద్రం సేవలు దోహదపడతాయని శ్రీ ఆంజనేయ ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మారీసుపేటలోని అప్పల స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కిషోర్ గురూజీ పాల్గొని బాటసారులకు మజ్జిగ అందజేశారు. నగరం తహసీల్దార్ జి.నాంచారయ్య సతీమణి రేణుకాదేవి సహకారంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు కిషోర్‌గురూజీ తెలిపారు. కార్యక్రమంలో శివరామిరెడ్డి, కోమల, భూలక్ష్మి, రోహిత్, కాశీ, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సాయికృష్ణ, రాంబాబు

4న తెనాలిలో అన్నమయ్య పాటల పోటీలు

తెనాలిటౌన్: శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం తెనాలి ఆధ్వర్యంలో మే 4వ తేదీన పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అన్నమయ్య పాటల పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలియజేశారు. ఆదివారం స్థానిక బోసురోడ్డులోని దేవాలయంవద్ద కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వాసవీ అమ్మ వారి దేవస్థానంలోని గీతామందిరంలో అన్నమయ్య పాటల పోటీలు జరుగుతాయని చెప్పారు. 8 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు ఎవరైనా పోటీల్లో పాల్గొన్న వచ్చని తెలిపారు. జూనియర్–1 విభాగం 8 సంవత్సరాల నుంచి 13 సంవత్సరాల వరకు, జూనియర్–2 విభాగం 14 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల వరకు, సీనియర్–1 విభాగం 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలు, సీనియర్–2 విభాగం 36 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వరకు పాటల పోటీలు జరుగుతాయని చెప్పారు. జూనియర్ విభాగాలకు ఒక్కొక్కదానికి మొదటి బహుమతి రూ.1000, రెండోవ బహుమతి రూ.500, మూడో బహుమతి రూ.300లు, జూనియర్–1 విభాగానికి10 మందికి ప్రోత్సాహక అందిస్తామని తెలిపారు. సీనియర్ విభాగానికి మొదటి బహుమతి రూ.500, రెండోవ బహుమతి రూ.300, మూడోవ బహుమతి రూ.200లు నిర్ణయించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 9246440685 వాట్సాప్ నెంబర్‌కు తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించాలని తెలిపారు. పోటీలు ప్రతిఒక్కరిలో భక్తి భావం పెంపొందించేందుకు నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎ.బాలచంద్రమౌళి, తన్మయి, వి.ఉమామహేశ్వరరావు, లక్ష్మీ సరోజిని, సుబ్బారావు, పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సంకీర్తన సేవా బృందం

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి



మృతుడు కనకారెడ్డి(ఫైల్)



మృతుడు కనకారెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకట శివకుమార్

చందోలు(కర్లపాలెం): చెరువు కట్టపై నుంచి ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన పిట్టలవాని పాలెం మండలంలోని అలకాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. చందోలు ఎస్ఐ ఎం.వెంకట శివకుమార్ తెలిపిన వివరాల మేరకు అలకాపురం గ్రామానికి చెందిన బేతాళం వెంకట కృష్ణంరాజు రొయ్యల చెరువులో ట్రాక్టర్లతో మరమ్మతులు చేయిస్తున్నారు. ఆదివారం చెరువు కట్టపై మరమ్మతులు చేస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ చెరువులోకి బోల్తా పడటంతో డ్రైవర్ అక్కల కనకారెడ్డి(50) ట్రాక్టర్ కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడు అక్కల కనకారెడ్డి కర్లపాలెం మండలం గణపవరం పంచాయతీ చినపులుగువారిపాలెంకు చెందిన అక్కల కృష్ణారెడ్డి కుమారుడు. నిరుపేద కుటుంబానికి చెందిన కనకారెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కుమార్తె శివలీల, కుమారుడు రామాంజనేయరెడ్డి ఉన్నారు. మృతుని భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించేందుకు మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వృథాను అరికట్టండి..!



రేపల్లెరూరల్: పట్టణంలో మున్సిపల్ ప్రధాన పైప్ లైన్లకు ఏర్పడుతున్న లీకులతో తాగునీరు వృధాగా పోతుంది. లీకేజీలను శాశ్వతంగా అరికట్టడంలో మున్సిపల్ అధికారులు విఫలం అవుతుండడంతో వేలాది లీటర్ల తాగునీరు నిత్యం మురుగు కాలువల పాలవుతుంది. గత ఆరు నెలల క్రితం పద్మశాలి కల్యాణ మండపం సమీపంలో ఏర్పడిన లీకుని నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారు. దీని ద్వారా నిత్యం వేలాది లీటర్ల తాగునీరు వృథాగా పోయింది. వేసవిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటిమట్టం తగ్గుతుండడంతో పట్టణంలోని పలు వార్డులకు పూర్తిగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే నీటి వృధాను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి లీకులను సరిచేసి నీటి వృధాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సామాజిక బాధ్యతతో మెలగాలి

చినకాకాని (మంగళగిరి): విపత్కర పరిస్థితులలో సామాజిక బాధ్యతతో మెలుగుతూ ప్రజలకు అండగా నిలవడమే జన సేవాదళ్ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. నగర పరిధిలోని చినకాకానిలో పది రోజులుగా సాగుతున్న జన సేవాదళ్ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ.. పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26వ తేదీన పండుగలా వేడుకలు జరుపుకోవాలన్నారు. దేశంలో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులలో రెడ్ షర్ట్ వలంటీర్‌ల సేవలు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిన్ని తిరుపతయ్య, గుజ్జుల ఈశ్వరయ్య, కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, అన్నవరపు ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత మృతి

వివాహమైన పది నెలలకే మృతి చెందిన వైనం



రాజకుమారి మృతదేహం

కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర గ్రామ శివారు గుదిబండివారిపాలెంలో వివాహిత ఉరి వేసుకుని మృతి చెందింది. వివాహమైన పది నెలలకే, అందునా ఐదు నెలల గర్భవతి అయిన ఆమె మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుంటూరు రాజకుమారి (18) ఆదివారం మధ్యాహ్నం ఉరికి వేలాడుతూ మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. రాజకుమారి స్వగ్రామం భట్టిప్రోలు మండలంలోని పెదపాలెం గ్రామం. సుమారు 10 నెలల క్రితం గుదిబండివారిపాలెం గ్రామానికి చెందిన యువకుడు సుందరరాజును ప్రేమ వివాహం చేసుకుంది. ఇరు పక్షాలను ఒప్పించి పెళ్లి చేసుకున్న రాజకుమారి ప్రస్తుతం ఐదు నెలల గర్భవతి. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో భర్తతో స్వల్ప ఘర్షణ జరగడంతో లోపలికి వెళ్లి తలుపు వేసుకుని చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్పాపడింది. సమాచారం అందుకున్న రూరల్ సీఐ ఆర్. ఉమేష్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. రాజకుమారి, సుందరరాజు కుటుంబాలు చర్చలు జరుపుకుంటున్నాయి. ఆదివారం రాత్రి వరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.

పాస్టర్ ప్రవీణ్ కేసులో ఎన్నో అనుమానాలు



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

తాడేపల్లి రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున కోర్టులో పిల్ వేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం తాడేపల్లిలోని ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అందరితో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేస్తామని, కోర్టు ద్వారా న్యాయం కోసం ముందుకు వెళతామని అన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల పోస్టుమార్టం రిపోర్ట్‌లో స్పష్టత లేదని విమర్శించారు. ప్రయాణం చేసింది, ఆగింది, మద్యం కొనుగోలు చేసింది ప్రవీణ్ కుమార్ అని ఎక్కడా నిరూపణ కాలేదన్నారు. చనిపోయిన వ్యక్తి ప్రవీణ్‌కుమార్ అనేది తప్ప పోలీసులు చూపిన వీడియోల్లో ఆయన ప్రవీణ్‌కుమార్ అని నిర్ధారణ కాలేదన్నారు.

తనకు ఎన్నో పోస్టుమార్టం రిపోర్టులు చూసిన అనుభవం ఉందని, మద్యం తాగడం వల్లే మృతి చెందాడంటూ పోస్టుమార్టం రిపోర్ట్‌లో కావాలని రాసినట్లు ఉందని అన్నారు. మద్యం వల్లే చనిపోతే ఈ దేశంలో, రాష్ట్రంలో ఇంతమంది ఎలా బతికి ఉన్నారని ప్రశ్నించారు. ప్రిలిమినరీ రిపోర్ట్‌లో 120 ఎంఎల్ ఫ్లూయిడ్ ఉందని రిపోర్ట్ ఇచ్చారని, ఈ ఫ్లూయిడ్‌లో అనుమానాస్పదమైన ఆల్కహాల్ లేదని ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రిలిమినరీ రిపోర్ట్‌లో ఆల్కహాల్ లేదని చెప్పిన వైద్యులు ఫైనల్ రిపోర్టులో ఆల్కహాల్ ఉందని ఇవ్వడం చిత్రంగా ఉందన్నారు. ఎందుకు ఆల్కహాల్ గురించి ఇంతగా ప్రస్తావిస్తున్నారు. పోలీసులు మొదట చెప్పిన ప్రెస్‌మీట్‌లో ఎక్కడా ఆల్కహాల్ గురించి ప్రస్తావన లేదన్నారు. పనిగట్టుకుని మరీ ఆల్కహాల్ ఉందని రిపోర్టులు రాశారని అనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ఏపీలో అసలు మానవ హక్కులు ఉన్నాయా అని ప్రశ్నించారు. స్వేచ్ఛగా నిరసన తెలిపే హక్కు ఒక పౌరునికి లేకపోవడం, రెండుసార్లు ఎంపీగా చేసిన హర్షకుమార్‌ను అరెస్ట్ చేసి వేధించడం ఎంతవరకు సబబు అని అన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్న కొద్దీ ప్రవీణ్‌కుమార్‌ది హత్యే అని అనుమానాలు బలపడుతున్నాయని పేర్కొన్నారు.

పీహెచ్‌సీకి సామగ్రి వితరణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో కంప్యూటర్, ఏసీ, వాటర్ కూలర్, బీరువా, ఇతర ఫర్నిచర్‌ను ఆదివారం రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సర్వీస్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ జొన్న రాజేష్, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్ష, కార్యదర్శులు రావూరి రమేష్‌బాబు, సెక్రటరీ సుకుమార్ రెడ్డిలు మాట్లాడుతూ గతంలో ఇందిరా నగర్, కుంచనపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకూ సామగ్రి అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ పి.శివరంజని, మాజీ అసిస్టెంట్ గవర్నర్ వంశీకృష్ణ, మున్నంగి వివేకానంద రెడ్డి, చంద్ర ఓబులారెడ్డి, కిరణ్‌కుమార్, కాట్రగడ్డ శివనారాయణ, రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, జొన్న కిషోర్, డి. వెంకట నరసింహం, నరేంద్ర, అమరేంద్ర, తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శాంతి, అనూష, హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

కాలువ మట్టి.. చేనుకు మెరక!

యథేచ్ఛగా తవ్వకాల్లో కూటమి నాయకుడు



కట్టను తవ్వి పొలంలో మెరక చేసుకుంటున్న దృశ్యం

పెదకాకాని: పాలించేవాడు మనవాడైతే ఏం చేసినా అడ్డు చెప్పేవారే ఉండరన్న చందంగా స్థానిక కూటమి నాయకులకు కాలం సాగుతుంది. మండంలోని తక్కెళ్లపాడు వాటర్ ట్యాంక్ సమీపంలో గుంటూరు ఛానల్(కొత్త కాలువ) కట్టను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రైతు చేబ్రోలు అప్పారావు ప్రొక్లెయిన్‌తో తవ్వించి తన చేనుకు మెరక వేసుకుంటున్నారు. ఈ ఏడాది అధికంగా కురిసిన వర్షాలకు కాలువ కట్టలు బలహీనంగా మారడంతో పాటు కాలువ కట్టకు పలు చోట్ల గండ్లు పడి వరి పొలాల్లోకి నీరు చేరి పైర్లు దెబ్బతిన్నాయి. అయినప్పటికీ కాలువ కట్టలను ఎటువంటి పటిష్టం చేయకపోగా ఆదివారం గ్రామానికి చెందిన ఆయన ఏకంగా కట్టను తవ్వి ఆ మట్టిని ట్రాక్టర్లతో తన పొలంలోకి చేర్చుకున్నారు. కాలువ కట్ట దెబ్బతింటుందని భావించిన పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రాంతానికి గ్రామ వీఆర్వో జగదీష్, కాలువ కట్టలకు సంబంధించిన లష్కర్ శ్రీనులు చేరుకుని తవ్వకాలను అడ్డుకున్నారు. అప్పటికే 50 ట్రక్కులకు పైగా కాలువ మట్టిని తన పొలంలోకి తరలించేశారు. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలని స్థానికులు చర్చించుకుంటున్నారు.

చలివేంద్రం ప్రారంభం

చినకాకాని (మంగళగిరి): నగర పరిధిలోని చినకాకానిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకుడు థామస్ మేస్త్రీ ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ, ఎం.కాంతారావు, మర్రి వెంకయ్య, నాగరాజు, డి.గోపి, గుత్తికొండ సీతారామిరెడ్డి, ఎం.చిన్నోడు పాల్గొన్నారు.

